ప్రజాశక్తి
శుక్రవారం 18 అక్టోబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

# రియల్ ఎస్టేట్ స్లో



- భారీగా తగ్గిన క్రయవిక్రయాలు
- అధిక ధరల ప్రభావం అంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

స్థలాలు, అపార్టుమెంట్‌లు క్రయ విక్రయాలు గుంటూరు జిల్లాలో మూడు నెలలుగా మందగించాయి. ఎన్నికలు పూర్తవ్వగానే కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో రాజధాని అమరావతి అభివృద్ధి వేగం పుంజుకుంటుందని భావించి ఆయా గ్రామాల్లో భూముల ధరలను భారీగా పెంచారు. కొంతమంది వ్యాపారులు, ఉద్యోగులు, అధికారులు రాజధాని గ్రామాల్లో స్థలాలు కొనుగోలుకు ఆసక్తి చూపారు. రాజధాని అభివృద్ధిపై ప్రభుత్వం పెద్ద ఎత్తున కసరత్తు చేస్తుండటంతో రియల్టర్ల మొత్తం ఒక్కసారిగా రాజధాని గ్రామాలకు వచ్చారు. జులైలో కొన్ని లావాదేవీలు జరిగినా ఆగస్టు నుంచి ఆకస్మికంగా క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. అంతేగాక అమరావతి అభివృద్ధి దీర్ఘకాలిక అంశంగా మారడం, వరదలతో ముంపు సమస్య ఏర్పడటంతో రాజధాని గ్రామాల్లో కొనుగోలుకు పలువురు వెనుకంజ వేశారు.

నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో జిల్లాలోని 18 మండలాల పరిధిలో రియల్ భూమ్ పెరుగుతుందని ఆశించారు. అన్ని ప్రాంతాల్లో ధరలు అనూహ్యంగా పెంచారు. అంచనాలకు అందని రీతిలో ధరల పెంపుతో చాలా ప్రాంతాల్లో కొనుగోలుకు రియల్టర్లు ఆసక్తి చూపలేదు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా క్రయవిక్రయాలు మందగించాయి. గతంలో ఉన్న ధరలను రెట్టింపు చేయడంతో కొనుగోలుదారులు ఒక్కసారిగా పునరాలోచనలో పడ్డారు. కేవలం హడావుడిగా వచ్చి చూసి వెళ్లే వారి సంఖ్య పెరగడమే తప్ప రిజిస్ట్రేషన్లు జరగడం లేదని అమరావతి మండలానికి చెందిన రియల్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

కూటమి ప్రభుత్వం రాగానే రాజధాని పరిసర మండలాలు, గ్రామాలలో కొత్త వెంచర్లు ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటయ్యాయి. చాలా వెంచర్లకు అనుమతి లేదని ఇప్పటికే కొన్నిచోట్ల వెంచర్లకు ఏర్పాటు చేసిన స్తంభాలు, రహదారులు, ఇతర ఏర్పాట్లను సిఆర్‌డిఎ అధికారులు పలు గ్రామాల్లో ధ్వంసం చేశారు. దాదాపు 50 చోట్ల అనధికారిక వెంచర్లు వెలిశాయని గుర్తించి నోటీసులుజారీ చేశారు. కేవలం దరఖాస్తు మాత్రమే చేసి అనుమతి రాకున్నా సిఆర్‌డిఎ అప్రూవ్‌డ్ అని ఆకర్షణీయ పద్ధతిలో పలువురు రియల్టర్లు బ్రోచర్లు ముద్రిస్తున్నారు. రాజధాని పరిసర మండలాలే కాకుండా జిల్లా అంతటా ధరలు భారీగా పెంచి వెంచర్లు వేశారు. అయితే ఎక్కడా క్రయ విక్రయాలు జరగడం లేదని రిజిస్ట్రేషన్ల అధికారులు చెబుతున్నారు. తాడికొండ, తుళ్లూరు, అమరావతి తదితర మండలాల్లో కొండవీటివాగు, పాలవాగు, కోటేళ్ల వాగు వల్ల వచ్చే ముంపు ప్రాంతాల్లో కూడా వెంచర్లు వేశారు. రాజధానిలో అధిక ధరలు ఉండటంతో పరిసర మండలాల్లో రోడ్డు పక్కన ముంపునకు గురయ్యే భూముల్లో వెంచర్లు వేసి స్థానికేతరులు అయినా కొంటారనే భావనతో వెంచర్లు వేయడం చర్చనీయాంశంగా మారింది. ఆగస్టు 31న అతి భారీ వర్షాలకు ఏయే ప్రాంతాల్లో ముంపు సమస్య ఉందో స్పష్టంగా అర్థం కావడంతో చాలా మంది కొనుగోలుదారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనుగోలుపై ఆచితూచి అడుగేస్తున్నారు.



# మంచి ప్రభుత్వానికి అన్యాయం కనిపించదా?

- యడవల్లిలో భూములు లాక్కోవడంపై సమగ్ర విచారణ చేయాలి
- బాధితులకు ఇప్పటికీ సరైన పరిహారం దక్కలేదని మరోసారి ధర్నా

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మంచి ప్రభుత్వమంటూ అర్భాట ప్రచారాలు చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు, నాయకులకు తమకు జరిగిన అన్యాయం కనిపించలేదా? అని యడవల్లి దళిత రైతులు ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మైనింగ్ పేరుతో తీసుకున్న భూముల విషయంలో అన్యాయంపై తహశీల్దార్ కార్యాలయం వద్ద మరోసారి ఆందోళనకు దిగారు. యడవల్లి దళిత, గిరిజన రైతు భూ పోరాట కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, సిఐటియు, తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో రైతుసంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ వ్యవస్థలు పాడైతే మెకానిక్ ముఖ్యమంత్రిగా గాడిన పెడతానంటూ బయలుదేరిన చంద్రబాబు యడవల్లికి బాధిత రైతులకు ఎప్పుడు కనిపిస్తారని అన్నారు. ఇక్కడి దళిత, గిరిజన రైతులు తమ భూముల కోసం ఏడేళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నారని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిన చంద్రబాబు యడవల్లి రైతుల పట్ల ఏ విధమైన వైఖరి తీసుకుంటారని అడిగారు. పల్లె పండగంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాగం తీస్తున్నారని, ఏ పల్లె సుఖంగా ఉందో చెప్పాలని నిలదీశారు. ఎరువులు, పురుగు మందులు సరిపడా లేదని, కల్తీ విత్తనాలు దెబ్బతీస్తున్నాయని, ఈ

2లో

## 2027 నాటికి స్పోర్ట్స్ సిటీ నిర్మాణం

- డిసెంబర్ నుండి గ్రామీణ క్రీడా సంబరాలు
- వర్సిటీలో అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ఎసిఎ అధ్యక్షులు శివనాథ్

2లో

## కొత్త రీచ్‌లలో ఇసుక తవ్వకాలు : పల్నాడు జెసి

2లో



### 4 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువన ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు చేరుతోంది. దీనితో సాగర్ జలాశయం నాలుగు క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుండి నాగార్జున సాగర్‌కు 79,916 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా ఈ మొత్తాన్నీ దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు, నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా అదే మొత్తలో నీటి నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,476 క్యూసెక్కులను, కుడి కాల్వ ద్వారా 8067 క్యూసెక్కులను, ఎడమ కాల్వద్వారా 6173 క్యూసెక్కులను, ఎస్ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులను లో లెవల్ కెనాల్ ద్వారా 400 క్యూసెక్కులను మొత్తంగా 78,916 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.




టిడిపి కార్యాలయానికి నిరసన ప్రదర్శనగా వెళుతన్న మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు

# అప్పుడు మద్దతు.. ఇప్పుడు కక్షలు..

**టిడిపి కార్యాలయానికి తొలగింపునకు గురైన మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల నిరసన ప్రదర్శన - విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాజకీయ వేధింపుల్లో భాగంగా తొలగించిన తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నరసరావుపేట మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు 15 రోజులుగా చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం దీక్షా శిబిరం నుండి ఎమ్మెల్యే కార్యాలయం వరకూ నిరసన ప్రదర్శన చేశారు. తాము పలు సమస్యలపై ఆందోళనలు చేసిన సందర్భంలో అప్పుడు ప్రతిపక్షంలో ఉండి మద్దతు తెలిపిన ఎమ్మెల్యే ఇప్పుడు కన్నెత్తయినా చూడ్డం లేదని విమర్శించారు. తొలుత 3వ రోజు రిలేదీక్ష శిబిరాన్ని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ ప్రారంభించి మాట్లాడారు. ఏం తప్పు చేశారని కార్మికులను తొలగించారో

2లో




పెదకాకానిలో మాట్లాడుతున్న పాశం రామారావు

### 21న సిపిఎం సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదకాకాని

గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'సమకాలీన రాజకీయ పరిణామాల'పై ఈనెల 21న నిర్వహించే సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రమైన పెదకాకానిలోని సుందరయ్య కాలనీలో గురువారం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు మాట్లాడతారని చెప్పారు. జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్ర హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని, రాజ్యాంగ స్ఫూర్తికి ఇది విరుద్ధమని చెప్పారు. ధరల భారంతో సామాన్యులు విలవిల్లాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని, మరోవైపు నిరుద్యోగం పెరిగిపోతోందని, ప్రజల ఆర్థిక పరిస్థితి దిగజారుతోందని ఆందోళన వెలిబుచ్చారు. క్రిమినల్ చట్టాల్లో

2లో



## కొత్త రీచ్‌లలో ఇసుక తవ్వకాలు : పల్నాడు జెసి

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** జిల్లాలో నూతనంగా గుర్తించిన ఓపెన్ రీచుల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభించి ఇసుక పంపిణీ చేస్తామని పల్నాడు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే చెప్పారు. అమరావతి, అచ్చంపేట మండలాల్లోని నూతన ఓపెన్ రీచులు, స్టాక్ పాయింట్లను ఆయన గురువారం పరిశీలించారు. అమరావతి మండలం జిడుగు, పొందుగులలో ఓపెన్ రీచ్‌లు, మల్లాదిలో స్టాక్ పాయింట్, అచ్చంపేట మండలంలోని అంబడిపూడి, కోనూరు గ్రామాల్లో ఓపెన్ రీచ్‌లు, స్టాక్ పాయింట్లను పరిశీలించారు.

## మద్యం అధిక ధరలకు అమ్మితే అడ్డుకుంటాం

**ప్రజాశక్తి - వెల్దుర్తి :** రాష్ట్రం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలని జనసేన నాయకులు బూసా రామాంజనే యులు డిమాండ్ చేశారు. మద్యం షాపుల వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే షాపుల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



## ప్రజా సమస్యలపై ఆందోళనలు : సిపిఎం

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :** మండంలోని ఆత్మకూరులో సిపిఎం విస్తృత సమావేశం జి.అజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా శుక్రవారం విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద నిరసన చేపట్టాలన్నారు. 21న తేదీన గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభను జయప్రదం చేయాలని కోరారు. వచ్చేనెల ఒకటో తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే ప్రజా సమస్యలపై ప్రచార ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. దుర్గారావు, సీతారామాంజనేయులు, రాంబాబు, రామారావు, శర్మ, బాబ్జి, సుబ్రహ్మణ్యం జనార్ధనరావు పాల్గొన్నారు.

## జీతం కోసం క్లాప్ ఆటో డ్రైవర్ల ధర్నా

**ప్రజాశక్తి - మంగళగిరి :** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్స్ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న 64 మందికి రెండు నెలలు, మూడు నెలలకు వేతనాలు చెల్లించడం లేదని, కార్మికులందరికీ వేతనాలు పెరిగినా క్లాప్ ఆటో డ్రైవర్స్‌కు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కేవలం నెలకు రూ.12,500 మాత్రమే చెల్లిస్తున్నారని, అవి కూడా సక్రమంగా నెలలో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్ చెల్లించడం లేదని, ఇఎస్ఐ కార్డులు పనిచేయడం లేదని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామని సమ్మె నోటీసును కార్పొరేషన్ కమిషనర్ ఆలింబాషాకు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు డి.శివ, రవి, సతీష్, ఆర్.కృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డ్రైవర్లు

# 2027 నాటికి స్పోర్ట్స్ సిటీ నిర్మాణం

- డిసెంబర్ నుండి గ్రామీణ క్రీడా సంబరాలు
- వర్సిటీలో అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ఎసిఎ అధ్యక్షులు శివనాథ్



**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

సౌత్ జోన్ 35వ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అధ్యక్షులు కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ క్రీడారంగంలోనూ నష్టపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. రాజధాని అమరావతిలో 2027లో స్పోర్ట్స్‌సిటీ నిర్మాణం చేపడతామని, ఆ సిటీ ద్వారా జాతీయ క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. టీవీలు, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్న విద్యార్థి, యువతను క్రీడలవైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. డిసెంబర్ నుంచి గ్రామీణ క్రీడా సంబరాలు నిర్వహనకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారని తెలిపారు. క్రీడా సౌకర్యాలు మెరుగుకు సహకరిస్తామని, ప్రతి స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. మంగళగిరిలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఏడాదిన్నరలో పూర్తికానందని చెప్పారు. పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఖేలో ఇండియాకు సంబంధించి వర్సిటీ నుండి పంపిన ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించాలని కోరారు. వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ క్రీడలకు నాగర్జున యూనివర్సిటీ హబ్‌గా నిలుస్తోందని, ఇక్కడ జాతీయ స్థాయి క్రీడల నిర్వహణకూ అవకాశం ఉంటుందని చెప్పారు. శాప్ ఛైర్మన్ ఎ.రవి నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో అంతర్జాతీయ స్థాయి క్రీడలు నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పోటీల నిర్వాహక కార్యదర్శి ఎ.గౌతమ్ కిరణ్ క్రీడా నివేదికను వివరించారు. ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం నుంచి క్రీడాకారులు వచ్చారని, వారికి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్‌ను సన్మానించారు. పోటీల ప్రారంభ సూచికంగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేయగా అతిథులు బెలూన్లు ఎగురవేశారు. రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం, క్రీడ విభాగం డైరెక్టర్ పిపిఎస్ పాల్‌కుమార్ పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షికి నివాళి

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అని చెప్పారు. వాల్మీకి రామాయణంలో దాదాపు 24 వేల శ్లోకాలు రాశారని, జ్ఞానం ఒకరి సొత్తు కాదని, కృషి చేస్తే జ్ఞాన సముపార్జన ఎవరికైనా సాధ్యమే అని నిరూపించారని చెప్పారు. డిఆర్ఒ వినాయకం, వాల్మీకి సంఘ నాయకులు, జిల్లా అధికారులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, పాల్గొన్నారు. ప్రపంచ మొట్టమొదటి చరిత్రకారుడు వాల్మీకి మహర్షి అని శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి అన్నారు. నరసరావుపేట శాఖా గ్రంథాలయంలో జరిగిన జయంతి సభకు గ్రంథాలయాధికారి వై.రాధ అధ్యక్షత వహించారు. స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ ఒక ఆదర్శ పురుషుని జీవిత సంగ్రహం రామాయణమని, తొలి ఆధ్యాత్మిక, మానసిక, ప్రవర్తన, పరివర్తన గ్రంథం, తొలి భూగోళ, ఖగోళ, నది,



పల్నాడు కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

నదముల, పర్యావరణ విషయాలు, నైసర్గిక స్వరూపాలు, భక్తి, వేదాంతము మానవులలోని దుర్గుణాలైనా అహంకారం, అసూయ, గర్వం, కామ, క్రోధ, లోభ, మోహ, మత్సర్యాలనే షడ్ వ్యసనాల గురించి వివరించే మహాకావ్య రచయిత వాల్మీకి మహర్షి అని వివరించారు. అనంతరం రాధ, రెడ్‌క్రాస్ సభ్యులు బి.మురళి మాట్లాడారు.

**ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్**

సత్తెనపల్లి పట్టణం 12 వార్డులోని వాల్మీకి మహర్షి విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జనసేన నాయకులు బి.వెంకట అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని చాటిన మహానుభావుడు వాల్మీకి అని కొనియాడారు.

**ప్రజాశక్తి - వినుకొండ**

స్థానిక టిడిపి కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పూలమాలేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించారని చెప్పారు. వాల్మీకి బోయల చిరకాల డిమాండ్ అయిన రిజర్వేషన్ల అంశంపైనా సానుకూల నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆ సామాజిక తరగతిలో ప్రతిభావంతులనూ సత్కరించి పురాస్కారాలు ప్రదానం చేసే కార్యక్రమాలూ భవిష్యత్‌తో చేపడతామన్నారు. ఎన్.శ్రీనివాసరావు, పి.ఆయూబ్ ఖాన్, పి.దాసయ్య, పివి.సురేష్‌బాబు, ఎం.కృష్ణ, వి.మురళీకృష్ణ, ఎం.వెంకట్రావు, ప్రభు, పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

టిడిపి కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచి ప్రభుత్వానికి అన్యాయం కనిపించదా?

(మొదటి పేజీ తరువాయి)

విషయమై ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. ధర్నాకు అధ్యక్షత వహించిన సిఐటియు నాయకులు పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యడవల్లి భూముల్లో గనులున్నాయని, వాటిని తీసుకోవాలని గత టిడిపి ప్రభుత్వం చూసిందని, రైతుల ఆందోళనతో వెనక్కి తగ్గిందని, వైసిపి ప్రభుత్వం భయపెట్టి లాక్కుందని చెప్పారు. బాధిత రైతులకు కనీసం భూ సేకరణ చట్టం-2013 ప్రకారమైనా పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య మాట్లాడుతూ భూములను సర్వే చేయాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించినా చేయలేదని, ఇప్పటికైనా సర్వే చేయించి న్యాయం చేయాలని కోరారు. విసికె పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు వి.ముత్తయ్య, ఏపీ రాష్ట్ర గిరిజన సంఘాల అధ్యక్షులు బి శ్రీను నాయక్, బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు బి.బాబురావు, ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు మాట్లాడుతూ దళిత రైతుల పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించారు. న్యాయం దక్కే వరకూ పోరాడతామని ఉద్ఘాటించారు. దళిత భూముల్లో బినామీ పేర్లత దొంగ పట్టాదారులు పాస్ పుస్తకాలు పుట్టించారని, అందుకు కారకులనూ శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆ భూముల సర్వేతోపాటు సమగ్ర విచారణ చేయాలని, 416 ఎకరాలను కొలిచి హద్దు రాళ్ల వేయాలని, మిగిలిన భూమిని ఎస్సీ, ఎస్టీ రైతులకు పంచాలని, కబ్జాచేసిన వారిపై అట్రాసిటీ కేసులు పెట్టాలని, మైనింగ్ పేరుతో గత ప్రభుత్వం ఎపిఎమ్‌డిసికి కేటాయించిన 253 ఎకరాలను గుర్తించి ఆ సంస్థకు అప్పగించాలని, మిగతా భూమి ఎవరి స్వాధీనంలో ఉందో తేల్చాలనే డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. ధర్నాలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఎ.బాబురావు, వెంకట్రావు, ఎస్.లూథర్, టి.వెంకటస్వామి, కె.శివయ్య, రోశయ్య, వి.శాంసన్, టి.వెంకట్రావు, యడవల్లి దళిత, గిరిజన రైతులు పాల్గొన్నారు.

## అప్పుడు మద్దతు.. ఇప్పుడు కక్షలు..

(మొదటి పేజీ తరువాయి)

సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి చర్యలకే పూనుకున్నారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిని విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తం చేస్తామని హెచ్చరించారు. ఇది మంచి ప్రభుత్వం అంటూ ఒకవైపు ప్రచారం చేసుకుంటూ మరోవైపు తొలగింపులు, వేధింపులు ఏమిటని నిలదీశారు. ఇదేతీరు కొనసాగితే అధికార పార్టీ రాజకీయంగా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సిఐటియు నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ జీవనోపాధిని కోల్పోయిన వారు ఆందోళన చేస్తుంటే వారిని అధికారులు, ప్రజాప్రతినిధులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఈ విషయాన్ని సిఎం దృష్టికైనా తీసుకెళ్తామని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గతంలో కార్మికుల దీక్ష శిబిరాలను సందర్శించారని, రాలీల్లో పాల్గొని సంఘీభావం తెలిపారని, ఆ మద్దతు ఇప్పుడేమైందని ప్రశ్నించారు. ప్రతిరోజూ ఇటు వైపు నుండే వెళ్తున్న ఎమ్మెల్యే ఒక్కసారైనా కార్మికులను పట్టించుకోపోవడం దారుణమన్నారు. సమస్యలపై కిందిస్థాయి నుండి కలెక్టర్ వరకూ విన్నవించినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షలకు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సిలార్ మసూద్, చిన్న అల్లాబక్షు, జిలానీ మాలిక్, బి.నాగమల్లేశ్వరి, ఎస్.రమాదేవి, మహబూబ్ సుభాని, మహబూబ్ బాషా, సైదా, పి.రమణ, ఎ.పద్మ, మస్తాన్‌వలి, మల్లయ్య, యోహాన్, పి.ఏసు, జీవరత్నం, విజయలక్ష్మి, జి.రమణ, పి.నవీన్ పాల్గొన్నారు.

## 21న సిపిఎం సభను జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

మార్పులతో ప్రతిపక్షాలు, ఉద్యమకారులపై నిర్బంధాన్ని తీవ్రతరం చేసేందుకు కేంద్రం పూనుకుందని, ఈ నేపథ్యంలో సిపిఎం నిర్వహించే సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బి.బాబురావు, కె.సత్యనారాయణ, బి.సాంబయ్య, ఎస్.నీలాంబరం, ఎ.నాగేశ్వరావు, ఎం.వెంకాయమ్మ, వెంకటరమణ, మస్తాన్‌బి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సభ జయప్రదం కోసం తాడేపల్లిలోని ముగ్గురోడ్డు, వెంకయ్య కొట్టు సెంటర్, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, బోస్ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం శ్రేణులు కరపత్రాలు పంపిణీతో ప్రచారం చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు జి.సుబ్బారెడ్డి, వి.దుర్గారావు, డి.విజయభాస్కర్‌రెడ్డి, డి.విజయ్‌బాబు, కె.బాబురావు, ఎం.లీలమ్మ, పి.ఫిరోజ్ పాల్గొన్నారు.



# వెనుకబడిన తరగతులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

## వాల్మీకి మహర్షికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, తదితరుల ఘన నివాళి



గుంటూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డిఆర్ఒ తదితరులు

**ప్రజాశక్తి-గుంటూరు**

మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని గురువారం కలక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, డిఆర్ఒ పెద్దిరోజా, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మయూరి, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఒక మామూలు బోయి అయిన వాల్మీకి అకుంఠిత దీక్షతో మహర్షిగా మారి రామాయణ మహా కావ్యాన్ని రచించాడని అన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ వాల్మీకి రామాయణ మహా కావ్యానికి ఆద్యుడు అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం వారికి చట్ట సభల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సి వుందన్నారు. జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్‌కు సొంత భవనం అవసరం అని తెలిపారు. జ్యోతి బాపూలే స్టడీ సర్కిల్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఎ పీడీ టి.వి.విజయలక్ష్మి, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ వందనం, వాల్మీకి సంఘ నాయకురాలు బి.నాగమణి, సహాయ బీసీ సంక్షేమ అధికారి భవానీ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-గుంటూరు** :రామాయణం ప్రతి ఒక్కరూ చదవాల్సిన మహా గ్రంధమని, అటువంటి గ్రంధాన్ని రచించిన ఆది కవి వాల్మీకి జయంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభపరిణామం అని గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహం నాయుడు అన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిఎంసి ప్రధాన కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.



నివాళి అర్పిస్తున్న మేయర్ కావటి, ఇతర నాయకులు

**ప్రజాశక్తి తెనాలి** : వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి తన్నీరు విష్ణు వర్ధన్ రామాయణం ఇతిహాసం దృశ్యాలను చిత్రీకరించాడు. విష్ణువర్ధన్‌నుఉపాధ్యాయులు అభినందించారు.

**ప్రజాశక్తి-తాడేపల్లి**

కషి ఉంటే మనుషులు రుషులవుతారని సాధారణ మనిషి వాల్మీకి నిరూపించారని టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు కొనియాడారు. వాల్మీకి జయంతి గురువారం తాడేపల్లి టిడిపి పట్టణ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిలో పుట్టిన మాణిక్యం లాగా వాల్మీకి మహర్షి చరిత్ర పుటల్లో తనకంటూ ప్రత్యేకత నిలుపుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ మురళి. ఎం పుల్లారెడ్డి. ఈ భాస్కర్. జి నాగేశ్వరరావు. నాగుల్ మీరా. దుర్గారావు. గోపి. భాగ్యలక్ష్మి. మౌనిక తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో



మంగళగిరిలో నివాళులర్పిస్తున్న కేశన తదితరులు

**ప్రజాశక్తి - మంగళగిరి**

వాల్మీకి జయంతి సందర్భంగా మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి బీసీ సంక్షేమ సంఘం నాయకులు నివాళులర్పించార. ఇంకా ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, బీసీ టీవీ ఛానల్ సీఈఓ ఉప్పాల రాజ్ కిరణ్, పవన్,దానా గౌడ్, సతీష్,నాగబాబు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

**ఎం టి ఎం సి కార్యాలయంలో** : వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఆలిం భాష, అడిషనల్ కమిషనర్ కే శకుంతల, అధికారులు, పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

ఎపి నవచైతన్య బిసి సంక్షేమ సేవా సంఘం తెనాలి మార్కెట్ కార్యాలయంలో మహర్షి ఆదికవి వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఎపి అధ్యక్షులు మేడిపోయిన గంగా యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కందుల సాంబశివరావు గౌడ్, సెక్రటరి జనరల్ మల్లంపల్లి భీష్మ పాములు, తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు తాడిబోయిన ప్రవీణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు చట్టు శ్రీనివాసరావు, బుర్ర శ్రీను ఆర్టిసి శ్రీను, కావూరి శ్రీనివాస్, పసుపులేటి శివ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్పీ ఎం హనుమంతరావు

## హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్టు

**ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్**

మహిళ పై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన కేసు లో ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ ఎం హనుమంతరావు వివరాలు వెల్లడించారు. సత్తెనపల్లి రంగా కాలనీకి చెందిన రావినూతల కరుణ పై పులమాను పూర్ణచంద్రరావు ఉరఫ్ పూర్ణ కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. పూర్ణచంద్రరావుతో పాటు అతనికి సహకరించిన పల్లపు అంకమరావులను పోలీసులు అరెస్టు చేశారు. పాలమాను పూర్ణచంద్రరావు ఏ పూర్ణ సినిమా ఫీల్డ్‌లో లైట్ బాయ్‌గా పని చేస్తుంటాడు. సుమారు మూడు సంవత్సరాల క్రితం సత్తెనపల్లి పట్టణశివారులో రంగా కాలనీ 16వ లైనులో అద్దెకు ఉండే కరుణ కుమార్తె భారతితో పరిచయం ఏర్పడటంతో వారిద్దరూ సహజీవనం చేస్తున్నారు. కొద్ది రోజులుగా భారతిని హింసిస్తుండటంతో భారతి తల్లి కరణ పూర్ణను మందలించింది. ఇది మనసులో పెట్టుకున్న నిందితుడు ఇనుప రాడ్డుతో దాడి చేసి ఆమె చెయ్యి విరగొట్టాడు. పూర్ణ హింసను భరించలేక భారతి ఇంటి నుండి వెళ్లిపోయింది. ఈ క్రమంలో భారతి విషయాన్ని చెప్పమని ఆమె తల్లి కరుణను వెంట తెచ్చుకున్న కత్తితో దాడిచేసి పొడిచాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు డిఎస్పీ తెలిపారు. నేరానికి ఉపయోగించిన వాహనం, మరియు కత్తిని పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. సమావేశంలో పట్టణ సిఐ బి.బ్రహ్మయ్య , ఎస్ఐ సంధ్యారాణి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్ల జైలు శిక్ష

**ప్రజాశక్తి - గుంటూరు లీగల్**

రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్లు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జి.స్పందన గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గుంటూరు పట్టణంలోని రామనామ క్షేత్రంలోని నాలుగో లైన్‌లో నివాసం ఉంటున్న పసుపులేటి గణేశ్ ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో తన తండ్రి హరి శంకర్రావు పట్నంబజార్‌లో నిర్వహిస్తున్న హార్డ్ వేర్ షాప్‌లో పని చేసేవాడు. 2021 అక్టోబర్ 12న హార్డ్ వేర్ షాప్‌నకు సంబంధించి ఆర్డర్ తీసుకునేందుకు గుజ్జనగుండ్ల వెళ్లాడు. ఈ క్రమంలో జేకేసీ కాలేజి రోడ్డులో బైక్‌పై వస్తుండగా, ఆర్టీవో ఆఫీసు వైపు నుంచి జేకేసీ కాలేజి వైపు వస్తున్న కారు అతివేగంగా వస్తూ అదుపు తప్పి గణేశ్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన గణేశ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మతి చెందాడు. దీనికి సంబంధించి రామిరెడ్డినగర్‌కు చెందిన కారు డ్రైవరు కంప రంజన్‌పై గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసుకు ఏపీపీ గాదె వెంకటేశ్వర్లు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. సాక్షులను ప్రవేశ పెట్టడంలో కోర్టు కానిస్టేబుల్ పి.రాంబాబు సహకరించారు.

## బ్యాటరీ చోరులు అరెస్టు

**ప్రజాశక్తి - పెదకూరపాడు** : బ్యాటరీలు దొంగలించిన ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టు హాజరు పరిచినట్లు పెదకూరపాడు ఎస్సై గిరిబాబు గురువారం తెలిపారు. ముద్దాయిలు బి వెంకటేష్, మణికంఠ, ధనరాజులు కలిసి జలాల్పురంలో ఎయిర్ టెల్ చెందిన 24 బ్యాటరీలు దొంగి లించారని తెలిపారు. వాటి ఖరీదు లక్ష 80వేలు ఉంటుందన్నారు. వీరిని సత్తెనపల్లి కోర్టుకు హాజరపరిచామన్నారు.

## విద్యుత్ షాక్‌తో టెక్నీషియన్ మృతి

**ప్రజాశక్తి - దాచేపల్లి** : ప్రమాదవశాస్తూ విద్యుత్ షాక్‌కు గురై ఒకరు మృతి చెందిన సంఘటన కారంపూడి మండలం బట్టువారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి దాచేపల్లి నగర పంచాయతీలో నివాసం ఉంటున్న జాలే నాగేశ్వరరావు (42) కేబుల్ టీవీలో ఫైబర్ జాయింట్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం బట్టువారిపల్లి గ్రామంలో కేబుల్ వైరు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాస్తూ విద్యుత్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

## జిఎంసి లారీ ఢీకొని ఒకరు దుర్మరణం

**అమరావతి రోడ్డులో ఘటన**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు నగరపాలక సంస్థ చెత్త తరలింపు వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన అమరావతి రోడ్డులో గురువారం జరిగింది. మృతిచెందిన వ్యక్తి వెళాంగిణి నగర్ ప్రాంతానికి చెందిన రవికుమార్‌గా స్థానికులు నిర్ధారించారు. రవికుమార్ నడుపుతున్న ద్విచక్రవాహనం మరో వాహనాన్ని ఢీకొట్టడంతో అతను కిందపడిపోయాడు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న చెత్త లారీ రవికుమార్ పై ఎక్కిందని స్థానికులు చెప్తున్నారు. అరండల్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు

**ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్**

మండలంలోని నందిగామ జెడ్‌పి పాఠశాలలో సెపక్ తక్రా పురుషులు, మహిళా జిల్లా జట్లు ఎంపిక గురువారం చేపట్టారు. పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వడ్డెంపూడి పవన్ కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు శ్రీకాకుళం జిల్లాలో జరిగే సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి పి.శివరామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసరావు, పిఇటిలు ఎల్.పిచ్చయ్య బి.అనిల్‌దత్త నాయక్, కె.శివనాగ శశికళ, కె.సునీత పాల్గొన్నారు.

**పురుషుల జట్టు :** కె.ఐజాక్, షేక్ షరీఫ్, జె.సుధాకర్, కె.కోటేశ్వరరావు, పి.నవీన్, స్టాండ్ బైలుగా కె.నాగరాజు, ఎం.వంశీ

**మహిళల జట్టు :**ఎం.అమూల్య, ఎ.మానస, ఎస్.సునీత, సయ్యద్ అఫ్రోజ్, జి.లలితశ్రీ, స్టాండ్‌బైలుగా ఎం.శ్రీలక్ష్మి, కె.ప్రశాంతి ఎంపికయ్యారు

## ఎన్‌ఓసీ లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

**ప్రజాశక్తి -దాచేపల్లి**

అగ్నిమాపక శాఖ అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) పల్నాడు జిల్లా కన్వీనర్ కె.సాయి, నాయకులు విక్రమ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అగ్నిమాపక శాఖ అనుమతులు (ఎన్‌ఒసి) లేని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో వేల సంఖ్యలో విద్యార్థులున్నారని, ప్రమాదాలు జరగక ముందే తనిఖీలు చేపట్టాలని కోరారు.

## రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - మాచర్ల**

సాఫ్ట్ బాల్ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనపర్చటం తమ కాలేజీకి గర్వకారణమని సెయింట్ ఆన్స ఇంగ్లీషు మీడియం కాలేజి ప్రిన్సిపాల్ తుమ్మా సూజాత అన్నారు. తమ విద్యార్థులు ఆలేటి కార్తీక్, గణష్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించినట్లు గురువారం చెప్పారు. ఈ నెల 9వ తేది నుండి 13వ తేది వరకు నంద్యాలలో జరిగిన 64వ జాతీయ స్థాయి క్రీడల్లో ఆలేటి కార్తీక్, పశ్చిమ గోదావరి జిల్లా పెద్దవేగిలో జరిగిన ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో గణేష్ అత్యుత్తమ ప్రతిభ కనపర్చి జట్ల గెలుపులో కీలక పాత్ర పోషించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు పిఇటి కూమార్, అధ్యాపకులు అభినందించారు.



## ఇసుక స్టాక్ పాయిట్లకు స్థలాలు చూడండి : జెసి

**ప్రజాశక్తి - పెదకూరపాడు, అచ్చంపేట**

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని సివిల్ సప్లయీస్ గోదామును, అచ్చంపేట మండలంలోని కోనూరు, అంబడిపూడి ఇసుక రీచ్, స్టాక్ పాయింట్లను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సూరజ్ గురువారం తనిఖీ చేశారు. పెదకూరపాడులో పెద్ద గిడ్డంగి ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలని తహశీల్దార్ దానియేలును ఆదేశించారు. అచ్చంపేట మండలంలో 9 ఇసుక రీచ్‌లు ఉండగా కోనూరు అంబడి పూడి వద్ద 1, 2, 3 స్టాక్ పాయింట్‌ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మిగిలిన రీచ్లలో కూడా స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసేలా చూడాలంటూ అధికారులకు సూచించారు. జెసి వెంట సత్తెనపల్లి ఆర్‌డిఒ రమాకాంత్, అచ్చంపేట తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్, డిటి జానీబాష సర్వేయర్లు, వీఆర్వోలు ఉన్నారు.



# యుటిఎఫ్ కార్యాలయంలో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రం




**ప్రజాశక్తి -దాచేపల్లి**

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఓటు నమోదు కేంద్రాన్ని స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సీనియర్ నాయకులు జి.వి శ్రీనివాసరావు, జి.శాంతారావు గురువారం ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదు చేయిస్తామని, అప్లికేషన్లు కావాల్సిన వారు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పి.రాజారావు, ప్రధాన కార్యదర్శి టి.ఆనంద్ కుమార్, నాయకులు నాగూల్‌మీరా, వాసుదేవరావు, మస్తాన్‌వలి, కొండలు, మోజేష్, సాగర్‌బాబు, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి- రెంటచింతల**

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఓటు నమోదు దరఖాస్తులను ఆవిష్కరించారు. 2019 మే లోగా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారంతా డిగ్రీ ప్రొవిజనల్, ఫొటో, ఓటర్



కార్డు, మొబైల్ నంబరు, మెయిల్ ఐడితో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులు యుటిఎఫ్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 9849703825, 9949852136 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజకుమార్, సాగర్‌బాబు, రామాచారి, సుదర్శన్, సురేష్‌బాబు, వసంతకుమారి పాల్గొన్నారు.

## ఆలయ భూమిలో కార్యాలయాల నిర్మాణాలపై విచారణ

**ప్రజాశక్తి -రెంటచింతల**

మండలంలోని మంచికల్లులో రామాంజనేయ స్వామి ఆలయ భూముల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించి ఆలయానికి నష్టపరిహారం చెల్లించలేదని గ్రామానికి చెందిన డీకొండ అచ్చయ్య దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సత్తెనపల్లి దేవదాయ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి గురువారం ఆ భూములను, నిర్మాణాలను పరిశీలించారు. సర్వే నంబరు 203లో 1.74 ఎకరాలు ఉండగా అందులో మూడు సెంట్లు రైతు భరోసా కేంద్రం, మూడు సెంట్లు విలేజ్ హెల్త్ క్లినిక్, 7.50 సెంట్లలో సహకార సంఘానికి




సంబంధించి గోడౌను నిర్మించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని లీలావతి చెప్పారు. ఆమెవెంట ఈవో రామిరెడ్డి ఉన్నారు.

## చిలకలూరిపేటలో 19న మెగా జాబ్‌మేళా : ఎమ్మెల్యే పుల్లారావు

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగులు, యువత కోసం శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శనివారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభం అవుతుందని, 2016-2024 మధ్యలో పదో తరగతి, ఐటిఐ డిప్లొమా గానీ ఇంటర్ పూర్తయిన వారితో పాటు డిగ్రీ బీటెక్, ఎంటెక్, పీజీలు, ఫార్మా చదివిన వారంతా హాజరుకావొచ్చని అన్నారు. 30కి పైగా కంపెనీలు 1000కి ఆఫర్లతో ఈ జాబ్‌మేళాకు హాజరవుతున్నాయని, పదో తరగతి ఫెయిల్ అయిన వారు కూడా హాజరవ్వొచ్చని తెలిపారు.

# వేలాది మంది పేదలకు విద్యనందించిన జాన్‌డేవిడ్



**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన డాక్టర్ జాన్‌డేవిడ్ ఆదర్శనీయుడని ఎఎంజి సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి, ఫార్ కార్నర్స్ డైరెక్టర్ జెస్సీ ఎస్ బర్నాబాసు అన్నారు. ఎఎంజి, ఫార్ కార్నర్స్, వేద సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ జాన్‌డేవిడ్ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఆయా సంస్థలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు గురువారం ఉదయం జాన్‌డేవిడ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పట్టణంలోని రిజిస్టర్ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గుండయ్య తోటలోని నిరీక్షణ ప్రార్థన మందిరం, ఎఎంజి ప్రాంగణాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో డాక్టర్ జాన్‌డేవిడ్ విద్యాసంస్థలను స్థాపించి వేలాదిమందికి ఉచిత విద్య అందించారన్నారు. చిలకలూరిపేట వాసుల దాహార్తిని తీర్చేందుకు భూరి విరాళాన్ని అందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కుష్టు, క్షయ బాధితులకు అందించిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్ సులక్షన్, సాంబయ్య, మోజస్, పీటర్, ప్రసన్న, సత్యంబాబు పాల్గొన్నారు. జాన్‌డేవిడ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ, కార్యకర్తలు పూలమాలలేశారు. నస్రుద్దీన్, కోటేశ్వరరావు, సుబ్బారావు, స్వప్న కుమార్ పాల్గొన్నారు.



## సమస్యలను సకాలంలో పరిష్కరించండి

**ప్రజాశక్తి-ఈపూరు**

సమస్యలపై ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి నరసరావుపేట ఆర్‌డిఒ కె.మధులత సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆమె విఆర్‌ఒలు, సర్వేయర్లతో సమీక్షించారు. భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో శు క్రవారం నుండి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అంగలూరులో 1254.22 ఎకరాలు అగ్రహారం భూములకు సంబంధించి ఉత్తరాది పీఠం వారితో మాట్లాడి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఇదిలా ఉండగా భూ రీసర్వే పూర్తయిన ఐదు గ్రామాలలో 24వ తేదీ వరకు భూ సమస్యలపై గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ ఎ.నళిని తెలిపారు. శుక్రవారం చిట్టాపురం, శనివారం గుండెపల్లి, 22న వనికుంట, 23న ఈపూరు, 24న బొమ్మరాజుపల్లిలో సభలుంటాయన్నారు. భూ రి సర్వేపై ఆయా గ్రామాల ప్రజలు నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరిస్తామని చెప్పారు.

## ప్రమాదకరంగా గుంత..

**ప్రజాశక్తి - అమరావతి**

మండల కేంద్రమైన అమరావతి బస్టాండ్ సమీపంలో గల సత్తెనపల్లి క్రాస్ రోడ్డులో ఏర్పడిన గుంత రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో వర్షం వస్తే ఇటువైపు ప్రయాణం ప్రమాదభరితంగానూ ఉంటోంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.





వెంకట శివవర్మను అభినందిస్తున్న వీసీ

## విజ్ఞాన్స్ వీసీ వ్యక్తిగత కార్యదర్శికి పిహెచ్‌డి

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా సేవలందిస్తున్న సీహెచ్.వెంకట శివవర్మకు ఆచార్య నాగార్జున యూనివర్సటీ పీహెచ్‌డీ పట్టా అందించింది. శివవర్మ 'ఎంప్లాయీ రెటెన్షన్ స్ట్రాటజీస్ ఇన్ బిజినెస్ ప్రాసెస్ అవుట్ స్టాండింగ్ సెక్టార్ విత్ స్పెషల్ రిఫెరెన్స్ టు సెలెక్ట్ కాల్ సెంటర్స్ ఎట్ హైదరాబాద్ - యాన్ ఎంపిరికల్ స్టడీ ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఏఎన్‌యు కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ నాగరాజు బట్టు గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వెంకట శివవర్మకు వీసీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## రాజమండ్రి జైలుకు బోరుగడ్డ అనిల్ తరలింపు : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వేర్వేరు కేసుల్లో నిందితుడుగా ఉన్న రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న బోరుగడ్డ అనిల్‌ను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి 9 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనిల్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడిగా తనకు తానే ప్రకటించుకున్నారని తెలిపారు. 2018లో అనంతపురంలో ఐఎఎస్ అధికారిగా చెప్పుకుంటూ పలువురిని మోసం చేసిన కేసులో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారన్నారు. ఆ తరువాత అనిల్ ఎన్నో నేరాలు, మోసాలు చేసినట్టు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అప్పటి సిఎం జగన్ ఆదేశిస్తే నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ను అవమాన పరుస్తూ వారిని నిందిస్తూ మీడియాలో ఇంటర్వ్యూలు ఇచ్చారన్నారు. వీరిద్దరినీ చంపుతానని కూడా ఆయన ప్రకటించారని ఈ అంశంలో సుమోటోగా ఆయనపై కేసు నమోదు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత జూన్ 5 నుంచి ఆయన పరారీలో ఉన్నారని అన్నారు. అనిల్‌పై 2019లో అరండల్ పేటలో రౌడీషీట్ ప్రారంభించారని తెలిపారు. అరండల్ పేట పరిధిలో ఒక చర్చి వివాదంలో ఒక వ్యక్తిని బెదిరించి డబ్బు తీసు కున్న వ్యవహారంలో 2021లో నమోదు అయిన కేసులో బుధ వారం రాత్రి బోరుగడ్డను అదుపులోకి తీసుకుని విచారించి గురువారం కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు పంపారని తెలిపారు. ఆయన్ను రాజమండ్రి జైలుకు తరలించినట్టు వెల్లడించారు. విచారణ నిమిత్తం ఆయన్ను పోలీసు కస్టడీకి తీసుకుంటామన్నారు. బోరుగడ్డ అనిల్‌పై మొత్తం 17 కేసులు ఉన్నాయన్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా వేరే వారి వ్యక్తిగత పరువు ప్రతిష్టలకు భంగం కలిగినట్టుగా ప్రవర్తించినా పోస్టింగ్ లు పెట్టినా క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేస్తామని ఎస్‌పి హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్

## అంబటి లక్ష్మణరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు మృతికి జనచైతన్యవేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పొన్నూరు మండలం వెల్లలూరుకుచెందిన ఆయన సుదీర్ఘకాలం పాటు న్యాయమూర్తిగాపనిచేశారని తెలిపారు. భారతదేశ న్యాయ వ్యవస్థకు వారు చేసిన సేవలు అమూల్యమైనవి,వారి నిజాయితీ, ముక్కుసూటి తనం, క్రమశిక్షణ, నైతిక విలువలు నేటి యువతకు ఎంతో ఆదర్శం అన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.




విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న సుప్రియారావు, తదితరులు

## స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులు స్వచ్ఛతని ప్రతిరోజూ దినచర్యలో భాగంగా అలవాటు మార్చుకోవాలని ఆదాయపన్ను శాఖ అదనపు కమిషనర్ ఎన్.సుప్రియారావు అన్నారు.ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవా వారోత్సవాలలో భాగంగా భారత్‌పేటలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సుప్రియారావు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కల సాకారం కావాలంటే సమాజంలో ప్రతి పౌరుడూ స్వచ్ఛతను బాధ్యతగా భావించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు జి.అరుణ్‌కుమార్, నాగప్రసాద్, కె.రామచంద్రరావు, పాఠశాల హెచ్‌ఎం టి.సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీల్లో జ్యోతివర్మకు బ్రాంజ్ మెడల్

ప్రజాశక్తి మంగళగిరి

ఈనెల14 తేదీ నుండి 18వ తేదీ వరకు గోవాలో జరుగుతున్న నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొన్న గుంటూరు కు చెందిన మహిళా పవర్ లిఫ్టర్ పి. జోతి వర్మ మాస్టర్స్ -2 విభాగంలో 69 కేజీ కేటగిరి బెంచ్ ప్రెస్ పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్ మూడవ స్థానం సాధించారు. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని గురువారం తెలియజేశారు.గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ చరిత్రలో నేషనల్ స్థాయిలో మాస్టర్ 2 విభాగంలో ఈ ఘనత సాధించిన మొట్ట మొదటి మహిళా పవర్ లిఫ్టర్‌గా ఆమె చరిత్ర సృష్టించారన్నారు. ఈ విజయం పట్ల ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరావు, గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్ ఎన్ వంశీ కృష్ణ, కోశాధికారి జి. వెంకటేశ్వరరావు తదితరులు జ్యోతి వర్మ ను అభినందించారని వారు తెలిపారు.



మెడల్ సాధించిన జ్యోతి వర్మ

## రైఫిల్ షూటింగ్‌లో కెఎల్‌యు విద్యార్థికి 5 బంగారు పతకాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గత నెల 26 నుంచి అక్టోబర్ 7 వరకు పెరు దేశం లోని లిమాలో జరిగిన జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్షిప్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి రైఫిల్ షూటింగ్‌లో పోటీ పడిన కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థి నేలవల్లి ముఖేష్ ఐదు బంగారు పతకాలను సాధించినట్లు వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ గురువారం ఒక తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వర్శిటీలో సిఎస్ఐటి మూడవ సంవత్సరం చదువుతున్న నేలవల్లి ముఖేష్ మొత్తం ఆరు విభాగాలలో జాతీయ జట్టుకు ఎంపికై 10 పతకాలకు పోటీ పడగా అందులో ఐదు బంగారు పతకాలు సాదించాడని తెలిపారు. 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగతంగా ఒక బంగారు పతకం, జట్టు విభాగంలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ రెండవ బంగారు పతకం, 25 మీటర్ల జట్టు విభాగంలో మూడవ బంగారు పతకం, ర్యాపిడ్ ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలో నాలుగవ బంగారు పతకం , 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జట్టు విభాగంలో ఐదవ బంగారు పతకం సాదించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి. పార్ధ సారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కె ఆర్ఎస్.ప్రసాద్, డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అద్యాపకులు విద్యార్థి నేలవల్లి ముఖేష్ కు అభినందనలు తెలిపారు.




ముఖేష్ ను అభినందిస్తున్న విసి డాక్టర్ జి.పార్థసారధివర్మ తదితరులు

## మేలైన యాజమాన్య పద్ధతులపై అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు : ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ (మేలైన యాజమాన్య పద్ధతుల)పై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయ అధికారులకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం గురువారం గుంటూరు కృషి భవన్‌లో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కమిషనరు కార్యాలయం నుండి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాలు నాయాక్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ యం.వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారులు కిరణ్మయి, లక్ష్మిరెడ్డి, తరుణ్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈకార్యక్రమంలో నిర్దేశించిన విధి విధానాలు తప్పనిసరిగా పాటించటం వలన రైతులకు నాణ్యమైన ఉత్పత్తి లభించి, అధికలాభం పొందటంతోపాటు సుస్థిర వ్యవసాయానికి దోహదపడుతుందని తెలియచేశారు. ఈవిధానంలో ప్రతి మండలంలో 5-6 మంది రైతులను డివిజన్ స్థాయిలో ఒక ఎఫ్‌పీవోకు అనుసంధానం చేసి, ఎపిఎస్ఒపిసిఎ వారి సహకారంతో, వారు పండించిన ఉత్పతుల నాణ్యతను ఎన్ఎబిఎల్ అక్రిడేషన్ కలిగిన ల్యాబ్‌ల ద్వారా పరీక్షించి స్కోప్ సర్టిఫికేట్ జారీ చేయటం జరుగుతుందన్నారు. స్కోప్ సర్టిఫికేట్ కలిగిన ఉత్పతులను రైతులు ఓఎన్‌డిసి లాంటి ఆన్లైన్ డిజిటల్ మార్కెట్ ప్లాట్ ఫారములలో ప్రదర్శించి ప్రపంచవ్యాప్తముగా అధిక ధరలకు అమ్ముకునే అవకాశం లభిస్తుందన్నారు.వ్యవసాయ కమిషనరు కార్యాలయ అధికారులు ఇండిగ్యాప్ సర్టిఫికేషన్‌కు సంబంధించిన విధానాలు, నిర్వహణ నియమాలపై అవగాహన కల్పించారు.




మాట్లాడుతున్న అధికారులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

## 20న చలపతి ఫార్మసీలో చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు

చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మశీ, చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో సంయుక్తంగా శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ వారి సహకారంతో ఈనెల 20వ తేదీన లాం గ్రామంలోని చలపతి ఫార్మశీ కళాశాల ప్రాంగణంలో తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. గురువారం కళాశాలలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ప్రొఫెసర్ రామారావు, ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం.గోపీనాథ్ ఆవిష్కరించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొత్తంగా రూ.80 వేలు నగదు బహుమతులను అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈటోర్నమెంట్లో పాల్గొనే వారు రూ.800లు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు ఎం.గోపీనాథ్ 97030 49378 ను సంప్రదించాలన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

## ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రభుత్వ హత్యే

ప్రజాశక్తి-గుంటూరు

ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా మరణం ముమ్మాటికి మోడీ, అమిత్‌షా ప్రభుత్వ హత్యేనని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి కొండారెడ్డి అన్నారు. గురు వారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక లాడ్జి సెంటర్‌లో సాయిబాబా మృతికి క్యాండిల్స్ వెలిగించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా మేధావులను కూడగట్టి కార్పొరేట్ సంస్థలు చేస్తున్న అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబాకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంమోపి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. చెయ్యని నేరానికి సాయిబాబా అతని సహచరులకు జీవిత ఖైదు విధించారన్నారు. తీర్పు సందర్భంగా '1982 నుండి గడ్చిరోలి ప్రాంత అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాడని, 90 శాతం అంగవైకల్యంతో ఉన్నా మానసికంగా చురుకుగా ఉన్నాడని, ప్రవాసమో ఉరిశిక్షో వేయవలసిందే గానీ చట్టం తన చేతులు కట్టేసిందని' సెషన్స్ కోర్టు వ్యాఖ్యానించడం బట్టి చూస్తే న్యాయస్థానాల్లో మనువాదులు తిష్ట వేసి తీర్పులిస్తున్నారని, అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్న సాయిబాబుకు కనీస వైద్య సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. అప్రజా స్వామికమైన ఉపాచట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై హత్యాకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ పోతురాజు, కర్రే యోహాను, సిఎస్ఆర్ ప్రసాద్, నల్లూరి రుక్మిణి, కె.కృష్ణ, కర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




క్యాండిల్స్‌తో నివాళి అర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు : అణగారిన వర్గాలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన ప్రొఫెసర్ సాయిబాబా తన స్వేచ్ఛకు, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లినా పౌర హక్కులు కాపాడే క్రమంలో సవాళ్లు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్నారని అవగాహన సభ్యులు అన్నారు. సీనియర్ ఇంజినీర్ ఎస్ సదాశివం, అవగాహన కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సి సుబ్బారెడ్డి, ఆర్ సింగయ్య, . ఆర్.వెంకటరత్నం, పి.భావన్నారాయణ, అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు.

## 22న విజయవాడలో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

22న విజయవాడలో వ్యవసాయరంగ సమస్యలపై నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జొన్న శివశంకరరావు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం ఎన్ యోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ సదస్సులో వ్యవసాయ రంగానికి చెందిన అనేక సమస్యలపై కేరళ మంత్రి మరియు ఇరిగేషన్ విద్యుత్ రంగ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలు బీమా ఆవశ్యకత కౌలు రైతుల సంక్షేమం తదితర అంశాలు చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జట్టి బాల రాజు వై బ్రమేశ్వరరావు బి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బాలల హక్కులపై అవగాహన

**ప్రజాశక్తి - యడ్లపాడు**

బాలికా హక్కులపై మండలంలోని కొండవీడు ఎంపియుపి పాఠశాలలో గురువారం అవగాహన కల్పించారు. బాలల హక్కుల గురించి, ఆరోగ్య సంరక్షణ గురించి ఎసిడిపిఒ బి.నిర్మల రాణి వివరించారు. బాల్య వివాహాల వల్ల తలెత్తే అనార్థాల గురించి చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పైన, లైంగిక వేధింపుల నివారణపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిసిపియు కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, హెచ్ఎం జి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఎం.జోజిమ్మ, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు.

## నేటి నుండి రెవెన్యూ గ్రామసభలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

నరసరావుపేట నియోజకవర్గంలో శుక్రవారం నుండి వచ్చే నెల1 వరకు రెవెన్యూ గ్రామసభలు జరుగుతాయని నరసరావుపేట, రొంపిచర్ల తహశీల్దార్‌లు కె.వేణుగోపాలరావు, బి.నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రొంపిచర్ల మండలం ముత్తనపల్లిలో 19న అన్నవరప్పాడు, 22న ఆరేపల్లి, 23న అలవాల, 24న నల్లగార్లపాడు, 25న దాసరిపాలెం, 26న మాచవరం, 28న సంతగుడిపాడు, 29న తురుమెళ్ల, 30న అన్నవరం, 1న రొంపిచర్ల సభలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సభల్లో పొలాలకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకములు, వెబ్‌ల్యాండ్, కొలతలు తదితర సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు.

## తహశీల్దార్ కరుణకుమార్ బదిలీ

**ప్రజాశక్తి - రెంటచింతల**

తహశీల్దార్ జి.కరుణ కుమార్‌ను ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడు నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు. ఈయన స్థానంలో గురజాల తహసిల్దార్ నగేష్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు.



## పన్నులు కట్టే వారికి బాధ్యతగా సేవ చేయాలి

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ జస్వంత్‌రావుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం పరిశీలించారు. పలు కూడళ్లలో చెత్త పేరుకుపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని ఆదేశించారు. గాంధీ పార్క్ వద్ద చెత్తను కార్మికులతో తీయించారు. పన్నులు చెల్లించే ప్రజలకు సరైన సేవలు అందించడంలో బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు, సిబ్బందికి చెప్పారు. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బంది పనితీరు మార్చుకోవాలన్నారు. పార్కులను పరిశుభ్రతతో ఉంచాలని సూచించారు.

## నేడు అర్చక సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి -రెంటచింతల :** పల్నాడు జిల్లా అర్చక సేవా సంఘం సమావేశం మాచర్లలోని కోదండ రామాలయంలో శుక్రవారం నిర్వహిస్తామని పల్నాడు జిల్లా అధ్యక్షులు చిట్యాల మల్లికార్జున శర్మ తెలిపారు. నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందని, ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వేణుగోపాల్, జె.వెంకట రామలింగశాస్త్రి హాజరవుతారని చెప్పారు.

# సంక్రాంతి నాటికి అభివృద్ధి పనుల పూర్తి



**ప్రజాశక్తి - వినుకొండ**

మండలంలోని ఏనుగుపాలెం, పిట్టంబండలో గురువారం నిర్వహించిన పల్లె పండుగలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఏనుగుపాలెంలో రూ.14 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. పిట్టంబండలో రోడ్లకు శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపిపై విమర్శలు గుప్పించారు.



**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

మాచవరం, కొత్తపల్లి, కర్లకుంట గ్రామాల్లో సిసి రోడ్లు, సైడ్ కాల్వలకు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శంకుస్థాపన చేశారు. నాయకులు జి.కోటేశ్వరరావు, ఎం.రామారావు, పి.జగ్గయ్య, జి.సురేష్, ఎస్.రామ్మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - నూజెండ్ల**

మండలంలోని జంగాలపల్లి, త్రిపురాపురం, మారెళ్లవారిపాలెం, అప్పాపురం గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ ఉమాదేవి ఆధ్వర్యంలో సిసిరోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేశారు. సర్పంచులు కె.చిన్నవెంకటేశ్వర్లు, జి.బ్రహ్మారెడ్డి, డి.రవీంద్ర, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి ప్రభాకర్‌రావు, ఏపీవో ఆంజనేయరాజు, పంచాయతీరాజ్ ఏఈ అల్లాబక్షు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




**ప్రజాశక్తి - నాదెండ్ల**

మండలంలోని ఎండుగుంపాలెం, చిలకలూరిపేట మండలంలోని గోపాళంవారిపాలెంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేశారు. గోపాళంవారిపాలెంలో రూ.కోటితో 4 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారి, రూ.15 లక్షలతో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణం, రూ.55 లక్షలతో ఎండుగుంపాలెం నుంచి అప్పాపురం వరకు డొంకరోడ్డు పునరుద్ధరణ పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు.




**ప్రజాశక్తి - నకరికల్లు**

మండలంలోని రూపెనగుంట్లలో రూ.10 లక్షలు, దేచవరంలో రూ.10 లక్షలు, కండ్లగుంటలో రూ.8 లక్షలు, చీమలమర్రిలో రూ.8 లక్షలతో నిర్మించే రోడ్లు, డ్రెయినేజీలతోపాటు రూ.2 లక్షలతో గోకులం షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి హరీష్, అడ్వకేట్ అలీబాష, ఎస్.శ్రీను, తహశీల్దార్ పుల్లారావు, ఎంపిడిఒ కాశయ్య పాల్గొన్నారు.



**ప్రజాశక్తి-పిడుగురాళ్ల**

మండలంలోని కోనంకి, పాతగణేశునిపాడు గ్రామల్లో పనులకు ఎంపిడిఒ రామచంద్రయ్య శంకుస్థాపన చేశారు. పంచాయతీ రాజ్ ఎఇ జి.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి దయాసాగర్, ఏపివో మేరిగ్రేస్, నాయకులు పాల్గొన్నారు.



**ప్రజాశక్తి - పెదకూరపాడు**

మండలంలోని పొడపాడులో రూ.5 లక్షలతో సిసి రోడ్లకు టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కె.రూపలక్ష్మి హనుమంతురావు, నాయకులు బి.రామ్‌గోపాల్‌రావు, వి.అప్పారావు, జి.బాబురావు, ముంతాజ్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధితో పాటు, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు సాధించి, పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రంగులు వేసేందుకు రూ.3 వేల కోట్లు, భూముల సరిహద్దు రాళ్లకు రూ.700 కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.4.5 వేల కోట్లతో 30 వేల అభివృద్ధి పనులు లక్ష్యంగా పల్లె పండుగ నిర్వహిస్తోందని, సంక్రాంతి నాటికి ఈ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. దీపావళి కానుకగా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు రానున్నట్లు తెలిపారు.

# నిధుల మంజూరుపై ఎంపీకి జనం అభినందనలు

**ప్రజాశక్తి - కారంపూడి**

ఒకప్పుడు పల్నాడు ప్రాంతం అనగానే ముందుగా గుర్తొచ్చేది ఫ్యాక్షనిజం, ఆ తరువాత అభివృద్ధికి నోచని ప్రాంతాలు. ముఖ్యంగా నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. నరసరావుపేట పార్లమెంట్ నుండే నాటి ముఖ్యమంత్రులు కాసు బ్రహ్మానందరెడ్డి, నెదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, కొణిజేటీ రోశయ్య సైతం ప్రతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుండి లావు శ్రీకృష్ణదేవరాయలు రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పల్నాడుకు జీవనాడిగా భావించే వరికపూడిసెల ప్రాజెక్టుకు అనుమతులు, నిధుల సాధన, అధ్వానంగా ఉన్న పొలం రహదారుల నిర్మాణంలో శ్రీకృష్ణదేవరాయలు కృషి చేశారు. తాజాగా కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారికీ నిధుల మంజూరు చేయించారు. పిడుగురాళ్ల నుండి గుంటూరు వెళ్లాలంటే సింగిల్ రోడ్డు కావడంతో వాహనదారులు భయంభయంగా ప్రయాణించాల్సి వస్తోంది. జాతీయ రహదారి కోసం గత ఎంపీలైన కొణిజేటి రోశయ్య, జనార్ధన్‌రెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి ప్రయత్నాలు ఫలించలేదు. శ్రీకృష్ణదేవ రాయలు ఎంపీ అయ్యాక ఆయన కృషితో కేంద్ర ప్రభుత్వం రూ.881.61 కోట్లు మంజూరు చేసింది. మాచర్ల నియోజకవర్గంలో కొత్త రోడ్ల నిర్మాణానికి సిఆర్ఎఫ్ నిధుల ద్వారా రూ.120 కోట్లను ఎంపీ మంజూరు చేయించడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీకి అభినందనలు తెలుపుతున్నారు.

**ప్రజాశక్తి -దాచేపల్లి**

పల్నాడు ప్రజలు ఎదురుచూస్తున్న కొండమోడు-పేరంచర్ల జాతీయ రహదారికి నిధులు కేటాయింపునకు కృషి చేసిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులకు దాచేపల్లి నగర పంచాయతీ ఇండిపెండెంట్ కౌన్సిలర్ షరీఫ్ గురువారం కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ రహదారి నిర్మాణానికి నోచక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, పల్నాడు ప్రాంతాల నుండి వివిధ రకాల పనులపై గుంటూరుకు వెళ్లే వారు అవస్థ పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణానికి రూ. 881.61 కోట్ల మంజూరు హర్షణీయమని పేర్కొన్నారు.



## చేతుల శుభ్రతతో ఆరోగ్యం

**ప్రజాశక్తి - క్రోసూరు :** చేతుల శుభ్రత దినచర్యలో ఒక ఆరోగ్యకరమైన పద్ధతిగా మార్చుకుంటే రోగాల బారి నుండి తప్పించుకోవచ్చునని ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్ అన్నారు. మండలంలోని దొడ్లేరులో గురువారం నిర్వహించిన అవగాహనలో ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చేతులను శుభ్రపరుచుకునే విధానంపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ధనరేఖ వివరించారు. ఆశాలు త్రివేణి, పార్వతి పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్, కంప్యూటర్‌కు చిన్నారులను దూరంగా ఉంచాలి

### ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ చెంచురెడ్డి

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

చిన్నారులను సెల్‌ఫోన్, కంప్యూటర్‌లకు దూరంగా ఉంచడం ద్వారా కంటి సంబంధిత వ్యాధుల భారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని మాక్స్ విజన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చెంచురెడ్డి అన్నారు. నరసరావుపేట మండలంలోని జొన్నగడ్డలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు గురువారం కంటి పరీక్షలు చేశారు. ఆహారంలో ఆకుకూరలు ఎక్కువుగా తీసుకోవడం ద్వారా కంటి ఆరోగ్యం బాగుంటుందని, చూపు సామర్థ్యం మెరుగుపడుతుందని చెప్పారు. స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు బయట ఆటలు ఆదుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా శారీరక, మానసిక పునరుత్తేజం కలుగుతుందన్నారు. అనంతరం డాక్టర్ చెంచురెడ్డిని సత్కరించారు. హెచ్ఎం జి.బర్నబాస్, డైరెక్టర్ కె.నాసరయ్య, స్కూల్ ఇన్‌ఛార్జి కె.బాపూజీ, అకడమిక్ కో-ఆర్డినేటర్ హేమంత్ పాల్గొన్నారు.



## ఆటోనగర్ అభివృద్ధికి సహకరించాలి : ఎమ్మెల్యే నసీర్

**ప్రజాశక్తి-గుంటూరు**



కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు ఆటో నగర్ అభివృద్ధికి మున్సిపల్ కార్పొరేషన్ సహ కరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆటో నగర్‌లో పూర్తి స్థాయిలో ఇంకా మౌలిక సదుపాయాల కల్పన కూడా జరగలేదన్నారు. గురువారం ఎమ్మెల్యే నగర కమిషనర్ పులి శ్రీనివాసులును కలిస ఆటో నగర్ అభివృద్ధిపై చర్చించారు. ఆటోనగర్‌లో పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.6 కోట్లను కార్పొరేషన్‌కి చెల్లించడం జరిగిందని వాటితో శానిటేషన్, పైపులైన్లు, డ్రైన్లు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ విషయంపై శనివారం సాయంత్రం 4గంటలకు ఎపిఐఐసి, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని రోడ్లు, అకాల వర్షాలకు గుంటలు పడ్డాయని వెంటనే ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలని, బొంగరాలబీడు శారదా కాలనీ రోడ్డు, శుద్ధపల్లి డొంక రోడ్డు విస్తరణ చేయాలని కోరారు.

## సచివాలయ సిబ్బంది బాధ్యతగా ఉండాలి : ఎమ్మెల్యే మాధవి

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలోని ప్రతి సచివాలయ పరిధిలోని ప్రజల సమస్యలు లేకుండా చూసే బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో 21 వ డివిజన్ సచివాలయం సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... 21వ డివిజన్ లో ప్రధానంగా డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. పారిశుధ్య సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని డివిజన్ ను పరిశుభ్రంగా ఉంచేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని, ఈ డివిజన్ లోక్ ఖాళీ స్థలాలు కూడా అధికంగా ఉన్నాయని వాటిలో పిచ్చి మొక్కలు మరియు మురుగు నీరు నిలిచి, చుట్టు ప్రక్కన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, స్థల యజమానులకు నోటిసులు ఇచ్చి వాటిని శుభ్రంగా ఉంచే బాధ్యత సచివాలయ సిబ్బందే తీసుకోవాలన్నారు. ఈ డివిజన్ లో పెన్షన్ లేని వారిని గుర్తించాలని,త్వరలో కొత్త పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోబోతున్నదని,కాబట్టి అర్హులయిన ప్రతి ఒక్కరికి పెన్షన్ మరియు పథకాలు అందే విధంగా చూసే బాధ్యత ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది ఉన్నదని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి పట్ల మర్యాదపుర్వకముగా నడుచుకోవాలన్నారు.

## విద్యుత్ భారాలపై నేడు సిపిఎం నిరసన

**ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022-2023 సంవత్సరానికి గాను ప్రజలు వినియోగించుకున్న విద్యుత్ వాడకానికి, ట్రూ అప్ చార్జీల పేరుతో భారాలు వేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకుంది. ఈ క్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం పది గంటలకు ఎంటిఎంసి పరిధిలోని మెల్లెంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం పార్టీ తాడేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరసనలో సిపిఎం పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికులు అందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

**ప్రజాశక్తి - తాడేపల్లి**

గత ప్రభుత్వం మాదిరి టిడిపి ప్రభుత్వం కూడా దొంగ చాటు గా ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో కరెంటు చార్జీలను పెంచడానికి విరమించుకోవాలని కోరుతూ తాడేపల్లి నులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శ బూరుగ వెంకటేశ్వర రావు ప్రకటనలో తెలిపారు.



నూనె విక్రేతలతో మాట్లాడుతున్న తహశీల్దార్

## రైతు బజార్‌లో తహశీల్దార్ పరిశీలన

**ప్రజాశక్తి - తెనాలి**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు బజార్లలో సబ్సిడీ ధరలకు కందిపప్పు, నూనె విక్రయిస్తున్న స్టాల్స్ ను తహశీల్దార్ కెవి గోపాల కృష్ణ గురువారం పరిశీలించారు. నందుల పేట గాంధీ ఇర్విన్ పార్క్ రైతు బజార్లో విక్రయాలకు సంబంధించి స్టాల్స్ వద్ద సరుకుల వివరాల ప్రదర్శన, ధరలను తనిఖీ చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు, తక్కువ ధరలకు సరుకుల విక్రయాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఆయన వెంట సివిల్ సప్లైస్ డిటి మూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ మురళి ఉన్నారు.



## స్థానికుల ఫిర్యాదుతో విచారణ

**ప్రజాశక్తి - తెనాలి**

సచివాలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న స్థానికుల ఫిర్యాదుతో తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ గురువారం విచారణ చేశారు. స్థానిక చినరావూరు 13వ వార్డులోని 16వ సచివాలయంలో ఇటీవల స్లాబ్ సీలింగ్ కూలిన సంగతి తెలిసిందే. ఈ భవనం కింది హాలులో కళ్యాణ మండపం ఉంది. గోడల ఎత్తు తక్కువగా ఉండటంతో రాత్రివేళ కొందరు యువకులు, అలాగే కళ్యాణ మండపంలో శుభ, అశుభ కార్య క్రమాల సమయంలో హాజరైన కొందరు మద్యం సేవించడం వంటి కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. సచివాలయ సిబ్బందితోపాటు స్థానికులతో తహసిల్దార్ చర్చించారు. అనంతరం ఈ ప్రాంగణంలో నైట్ వాచ్మెన్ ను కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరామని, పట్టణ వన్ టౌన్ సి ఐ తో మాట్లాడి రాత్రివేళ పోలీస్ బీట్ నిర్వహించాలని, బీట్ బుక్ కూడా నిర్వహించాలని కోరినట్లు తాసిల్దార్ వెల్లడించారు.

## గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**



కొలకలూరు గ్రామంలో గిరిజనులకు ట్రైబల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అంజలి రావూరి గురువారం నిత్యావసరాలు పంపిణి చేశారు. అకాల వర్షాల కారణంగా కొలకలూరు కాల్వకట్ట వంతెన కింద జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు తక్షణ సాయంగా నిత్యావసరాలతో పాటు ఆహార పొట్లాలు, కాయకూరలు అందజేసినట్లు ఆమె తెలిపారు. వర్షాలకు వీస్తున్న ఈదురుగాలులకు ఇంటిపైకప్పు ఎగిరిపోయి నిరాశ్రయులైన ఎస్టీల బ్రతుకులు దుర్భరంగా మారాయని అంజలి వివరించారు. యుద్ధప్రాతిపదికన నిరాశ్రయులకు వసతి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి మనవి చేశారు. కార్యక్రమంలో రావూరి సురేష్ బాబు, ట్రస్ట్ సభ్యులు షేక్ షబ్బీర్, బొంత కపమ్మ పాల్గొన్నారు.



## చిలువూరు, రేవేంద్రపాడులో పల్లెపండుగ

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

మండలంలోని రేవేంద్రపాడు చిలువూరు తుమ్మపూడి గ్రామాలలో గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమా లకు శ్రీకారం చుట్టారు .రేవేంద్రపాడులో సర్పంచ్ పలుకూరి మేరమ్మ ఆధ్వర్యంలో రూ.25 లక్షలతో చిలువూరు గ్రామంలో సర్పంచ్ చిలువూరు మాణిక్యం ఆధ్వర్యంలో 25 లక్షలతో తుమ్మపూడి గ్రామంలో సర్పంచ్ షేక్ అజిజూన్‌ఆ ధ్వర్యంలో రూ. 10 లక్షలతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో చిలు వూరు కార్యదర్శి ఎం శరత్, తోటకూట సీతారామయ్య రేవేం ద్రపాడులో పలుకురి శామ్యూల్ తుమ్మపూడి లో షేక్ జానీ బాషా, ఇన్చార్జి ఎంపీపీ షేక్ జబిన్ టిడిపి నాయకులు కేశం నేని శ్రీ అనిత కేశంనేని శ్రీధర్ వాసిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## చింతలపూడిలో కేంద్ర ప్రభుత్వ అధికారి పర్యటన

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

కేంద్ర ప్రభుత్వ రూరల్ డెవలప్మెంట్ శాఖ రిసోర్స్ సెక్రటరీ మనోజ్ జోషి గురువారం మండలంలోని చింతలపూడి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఫేస్ వన్‌లో జరిగిన సర్వేను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఇంజనీరింగ్ కాలేజీలో డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ను పరిశీలించారు. రీ సర్వే నిర్వహించటానికి అనుసరించిన పద్ధతులు సాంకేతికతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులు రీ సర్వే లో జరిగిన అవకతవకలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొందరు తమకు భూమి అదనంగా వచ్చినదని మరికొందరు తగ్గినదని తెలిపారు. చాలామంది రైతులు డాక్యుమెంట్లు పొందామని క్రొత్త పాస్ బుక్ లు ఇచ్చారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ సబ్ కలెక్టర్ సంజన సిన్హా సర్వే ఏడి నాగ శేఖర్ తాసిల్దార్ ఐ సునీత ఎంపీడీవో ఈ ఏ శ్రీనివాసరావు సర్పంచ్ రామకృష్ణ పాల్గొన్నారు.



## సమస్యలను త్వరగా పరిష్కరించండి

**అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశం**

**ప్రజాశక్తి-తాడేపల్లి :** ప్రజా దర్బార్ కు ప్రజల్ని వస్తున్న అర్జీలను త్వరగా పరిశీలించి పరిష్కరి ంచాలని అధి కారులను మంగ ళగిరి ఎమ్మెల్యే మరియు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. గురువారం ఉండవల్లి లో నారా లోకేష్ నిర్వహించిన ప్రజాదర్బార్ కు పలువురు అర్జీలు అందజేశారు. కార్ డ్రైవర్ గా పనిచేస్తున్న తన కుమారుడిని డ్యూటీ డ్రైవర్ లే హత్య చేశారని, కఠినంగా శిక్షించాలని ఉండవల్లికి చెందిన ఏపూరి వెంకటరమణ మంత్రికి విన్నవించింది. కుమారుణ్ణి కోల్పోయిన తనకు ఇల్లు గడవడం కష్టంగా ఉందని, ఇల్లు మంజూరు చేసి స్వయం ఉపాధి కల్పించి ఆదుకోవాల నీ నులకపేటకు చెందిన కొండా సుశీల ప్రజాదర్బార్లో వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం నిలుపుదల చేసిన రైతు కూలీ పెన్షన్ రాజధానిలో మరల పునరుద్ధరించి తనకు న్యాయం చేయాలని ఉండవల్లికి చెందిన శ్రీరామ్ మూర్తి ర్తి మంత్రి కోరారు. బీకాంపూర్ చేసి నిరుద్యోగ్య ఉంటున్నానని తనకు ఎయిమ్స్ లో ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరి కి చెందిన మహమ్మద్ రఫీ కోరారు. ఇవి కాక రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున తమ తమ సమస్య లు పరిష్కరించాలని ప్రజలు అర్జీలు అందజే సారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.



## వరద బాధితులకు పలువురు విరాళం

**ప్రజాశక్తి-తాడేపల్లి**

గత నెలలో సంభవించిన వరదలకు రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు గురువారం విరాళాలు అందజేశారు. కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన సాయి తేజ విద్యానికేతన్ నాలుగు లక్షల 25 వేలు మంత్రికి అందజేశారు. విరాళాలు అందజేసిన వారికి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ వారు ఇటీవల వరదలకు గురైన ప్రజలకు సహాయం అందించేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధికి రెండు లక్షల రూ.50 వేలు చెక్కును అందించారు. దోస్త్ కోఆర్డినేటర్ గద్దె శ్రీనివాస టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు గురువారం విద్యాశాఖ మరియు ఐటీ మంత్రి నారా లోకేష్ కు ఉండవల్లిలో ఈ చెక్కును అందించారు.



## లోకేష్‌కు గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధుల అభినందన

**ప్రజాశక్తి - మంగళగిరి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుచేసి స్వర్ణకారులను ఆదుకుంటామని మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకున్నారు. ఈ మేరకు కార్పోరేషన్ ఏర్పాటుపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేసిన మంత్రి నారా లోకేష్ ను మంగళగిరికి చెందిన లక్ష్మినరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేట్ కట్ చేయించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం మంత్రిని శాలువాలతో సత్కరించారు. స్వర్ణకారుల 60 ఏళ్ల కలను మంత్రి నారా లోకేష్ నెరవేర్చారని హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరిలో నారా లోకేష్ చేతులమీదుగా లక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతు మంగళగిరిని గోల్డ్ హబ్‌గా రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, పెద్దఎత్తున స్వర్ణ కార్మికులు పాల్గొన్నారు.



## 'ఇంటి తరహా భోజనం మా ప్రత్యేకత'

**ప్రజాశక్తి-తాడేపల్లి**

ఉండవల్లి సెంటర్లో గురువారం నూతనంగా శ్రీరామ్ హొటల్ ను జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. వ్యాపారం దినదినాభివద్ధి కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ హొటల్ అధినేత అంబటి తిరుపతిరావు మాట్లాడుతూ ఇంటి తరహా భోజనం అందించడం తమ ప్రత్యేకత అని చెప్పారు. నాణ్యత ప్రమాణా ల్లో ఎక్కడ రాజీ పడే ప్రసక్తే లేదని తెలిపారు. సొంత ఇంట్లో తిన్న అనుభూతి శ్రీరామ్ హొటల్ కస్టమర్లు పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని తిరుపతిరావు మరింత అభివద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.

## నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ వేళల మార్పు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడిచే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ వేళలను మార్చినట్లు రైల్వే అధికారులుతెలిపారు. సికింద్రాబాద్‌లో సాయంత్రం 6.10కి బయలుదేరి రాత్రి 10.55కి గుంటూరుకు చేరుతుంది. రాత్రి 11.05కి గుంటూరులో బయలుదేరి ఉదయం 5.55కి తిరుపతి చేరుతుంది. తిరుపతినుంచి సికింద్రాబాద్ వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ఎటువంటి మార్పులు లేవని అధికారులు తెలిపారు.

**60 రోజుల ముందే అడ్వాన్సు రిజర్వేషన్లు :** ప్రస్తుతం అమలులో ఉన్న అడ్వాన్సు రిజర్వేషన్ గడువును తగ్గించారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడికయినా 120 రోజుల ముందే రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఇక మీదట కేవలం 60 రోజుల ముందే రిజర్వేషన్ సౌకర్యం ఇస్తారు. ఈ నిబంధన నవంబరు ఒకటి నుంచి అమలులోకి రానుంది.

## ఎఎన్‌యు పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ పి. బ్రహ్మాజీరావు తెలిపారు. ఏపీ పీజీ సెట్ 2024లో ర్యాంకులు పొందిన వారు ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఎంకాం, ఎంఎ, ఎంఇడి, ఎంఎస్‌సి కోర్సులకు వర్సిటీ క్యాంపస్ కళాశాలలో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 21న ఉదయం 9.30 నుంచి 11.30వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రవేశాలు పొందే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు. వివరాలకు విశ్వవిద్యాలయంలోని అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

## మాస్టర్‌మైండ్స్ విద్యార్థినికి సిఎం చంద్రబాబు అభినందన

ప్రజాశక్తి-గుంటూరు


తేజస్విని ని అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సిఎంఎ ఫైనల్ ఫలితాలలో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించిన మాస్టర్ మైండ్స్ విద్యార్థిని కొత్తపేట తేజశ్విని ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు గురువారం రాష్ట్ర సచివాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఇటువంటి విద్యార్థులను తీర్చిదిద్ది జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని ఇనుమడింప చేసిన మాస్టర్ మైండ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల అడ్మిన్ అడ్వైజర్ సి.ఎ మట్టుపల్లి మోహన్ సిఎం సహాయ నిధికి రూ.7 లక్షల డిడిని సిఎంకు అందజేశారు.



## డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆగస్టులో నిర్వహించిన డిగ్రీ 5వ, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను గురువారం తాత్కాలిక వీసి ఆచార్య కే. గంగాధరరావు విడుదల చేశారు. బీకాం, బిఎ, బి.ఎస్సీ, బిసిఎ, బిబిఎ, బిఎఒఎల్ కోర్సులకు సంబంధించి ఫలితాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. 5వ సెమిస్టర్‌లో 5973 మంది విద్యార్థులకు 4095 మంది, 6వ సెమిస్టర్‌లో 300 మందికి 202 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్సైట్ www.anu.ac.in లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఏ. శివప్రసాదరావు మాట్లాడుతూ ఫలితాలకు సంబంధించి విద్యార్థులకు సందేహాలు ఉంటే రివాల్యుయేషన్ చేసుకోవచ్చుని సూచించారు. నవంబర్ 2వ తేదీలోగా రీవాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ వెరిఫికేషన్ చేసుకునేందుకు ఆఖరి తేదీఇవ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పర్సనల్ వెరిఫికేషన్, రివాల్యుయేషన్ ఒక్కొక్క పేపర్ కు రూ .1490 ఫీజు చెల్లించ వలసి ఉంటుందని పేర్కొన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె . రత్న షీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, డిగ్రీ పరీక్షల తాత్కాలిక కోఆర్డినేటర్ ఆచార్య ఎన్. వి కృష్ణారావు, రీసెర్చ్ సెల్ తాత్కాలిక కోఆర్డినేటర్ డాక్టర్ పి . సుధాకర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్దయ్య, పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాష్ రావు, వై. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు ఇద్దరు అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ నియామకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు ఇరువురిని అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ గా నియమించారు. ఈ మేరకు తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ గా నియమితులైన వారికి గురువారం తాత్కాలిక విసి ఆచార్య కే. గంగాధరరావు అపాయింట్మెంట్ లెటర్ లను అందజేశారు. ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న డాక్టర్ ఎం .గోపికృష్ణ కు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు, డాక్టర్ డి. చంద్రమౌళి కు అకడమిక్ బాధ్యతలు అప్పగించారు. వీరి ఇరువురు ఏడాది పాటు అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ హోదాలో విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గోపికష్ణ, చంద్రమౌళిలు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అసిస్టెంట్ ప్రిన్సిపల్ గా నియమించినందుకు వీసీ గంగాధరరావు, రెక్టార్ రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంలకు ధన్యవాదాలు తెలియజేశారు. సక్రమంగా విధులు నిర్వహించి వర్సిటీ కళాశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందజేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ

యువతలో నైపుణ్యాలు పెంపొందించి వారు స్వయం ఉపాధి రంగాలలో మెరుగైన అవకాశాలు పొందేలా శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్కిల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం కలక్టరేట్‌లో స్కిల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులైన డిఆర్‌డిఎ పీడీ, మెప్మా, ఏపిఎస్-ఎస్డీసి, డిఐసి, ఎన్‌ఏసి, సీడాప్, నిడ్‌క్యాప్, జిల్లా ఉపాధి శాఖల అధికారులు, వివిధ రంగాల పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీడాప్‌తో కలసి నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో జాబ్‌మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని, శిక్షణకు హాజరయ్యే దూరప్రాంత యువతకు ఉచిత వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి రమాదేవి తెలిపారు. అగర్‌బత్తి అసోసియేషన్ సభ్యులు తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని, అందుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఎలక్ట్రిక్‌కార్లు, స్కూటర్ల మెకానిజం నేర్పించడం, సెల్ ఫోన్, టీవి, ల్యాప్ టాప్ రిపేర్లలో ట్రైనింగ్ ఇచ్చి బ్యాంకు లోన్ ద్వారా సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ కల్పించాలన్నారు. అలాగే ఫ్లెక్సీప్రింటింగ్, లిఫ్ట్ ఆపరేటర్‌గా ట్రైనింగ్ ఇప్పించి యువత స్వయం ఉపాధి పొంది సొంతకాళ్ళ మీద నిలబడేలా జీవనోపాధి కల్పించవచ్చన్నారు. నిడ్‌క్యాప్ ప్రతినిధి మాట్లాడుతూ గత సంవత్సరం నుండి పిఎం అజయ్ ప్రోగ్రాం క్రింద మూడు వందల మందికి శిక్షణ ఇవ్వడానికి ఎదురు చూస్తున్నామని, ఎవరు ముందుకు రావడం లేదని, అందరు డిగ్నిటి ఆఫ్ లేబర్ కోరుకుంటున్నారన్నారు. లెదర్ పరిశ్రమ పై అవగాహన లేక యువత లెదర్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు పొందడానికి ఇష్టపడడం లేదన్నారు. నిరుద్యోగ యువత తల్లితండ్రులు కూడా తమ పిల్లలకు మంచి ఉద్యోగం వస్తుందని చెపుతున్నారని, శిక్షణకు పంపడం లేదని, మహిళలు వివాహం అనంతరం ఉద్యోగం మానివేసి వెళుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రొత్త ప్రభుత్వంలో అమరావతి క్యాపిటల్ రీజయన్‌లో నిర్మాణ, సర్వే రంగాలకు ఎక్కువ డిమాండ్ ఉందని, నిర్మాణ రంగంలో తాపీపని, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, కార్పెంటర్, పిఓపి, ఫాల్ సీలింగ్‌లతో యువతకు శిక్షణ ఇచ్చి యువతకు ఉపాధి కల్పించాల్సి వుందన్నారు. అలాగే మంగళగిరి చేనేత పరిశ్రమ దేశ వ్యాప్తంగా పేరు గాంచిందని, అక్కడ క్లస్టర్స్ ఏర్పాటు చేసి ఎలాంటి వృత్తి నైపుణ్యం గల వారు కావాలో, వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలో, వారి జీవనోపాధి ఎలా వుంటుందో ఆలోచించి ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను తయారు చేయాలన్నారు. ఐఐటీ , పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్స్ ఏర్పాటు చేయాలని , ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన క్రింద యువతకు బేసిక్ , అడ్వాన్స్ ట్రైనింగ్ అందించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ టి. విజయలక్ష్మీ, డిఎస్‌డిఓ కె.సంజీవరావు, స్కిల్ డెవలప్మెంట్ అడిషనల్ మేనేజర్ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామయ్య హైస్కూల్లో మొబైల్ సైన్స్ ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు



ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితరులు

సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం సంయుక్తంగా ఏర్పాటు చేసిన జీన్‌హెల్త్ కనెక్ట్ మొబైల్ సైన్స్ ప్రదర్శనను గురువారం స్థానిక పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ ప్రాంగణంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించటానికి ఏర్పాటు చేసిన ఈ సైన్స్ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని లక్ష్మణరావు అన్నారు. జన్యుపరంగా పుట్టకతో వచ్చే వ్యాధులు, వంశపారంపర్యంగా వచ్చే వ్యాధులు, ఉత్పిరివర్తనం వల్ల వచ్చే వ్యాధులు గుర్తించటం, వాటికి వైద్యం చేయడం మొదలైన విషయాలు, మనిషి జీవితంలో జన్యువుల ప్రాముఖ్యత తెలుసుకోవచ్చన్నారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి మాట్లాడుతూ మొబైల్ ప్రదర్శన, వీడియో ప్రజంటేషన్ ద్వారా విలువైన సమాచారం తెలుసుకోవచ్చన్నారు. కార్యక్ర మంలో జి.ప్రసాదరావు, పద్మజ, జెవివి నాయకులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, జి.వెంకటరావు, టి.ఆర్.రమేష్, ఎండి.అక్బర్, ఎస్.ఎం.సుభానీ, గురవయ్య మొబైల్ సైన్స్ ప్రతినిధులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చలపతిలో ఆండ్రాయిడ్ టెక్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు


విద్యార్థులకు యాప్స్ గురించి వివరిస్తున్న పవన్‌కుమార్

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ అనుబంధ విభాగాలు, ఎడ్యుస్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే గూగుల్ ఆండ్రాయిడ్ టెక్ క్యాంప్ గురువారం ప్రారంభం అయ్యింది. ఎడ్యుస్కిల్స్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ టీమ్ అసోసియేట్ మేనేజర్ ఎస్.వి.పవన్‌కుమార్ విద్యార్థులకు ఆండ్రాయిడ్ స్టూడియోని వినియోగించి వివిధ రకాల ఆండ్రాయిడ్ అప్లికేషన్లు ఎలా రూపొందించాలో వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికత దృష్ట్యా జాబ్ మార్కెట్ కోసం విద్యార్థులు సిద్ధం కావటానికి ఇలాంటి సాంకేతిక క్యాంపులు ఎంతో ఉపయోగపతాయని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఒలింపిక్స్ జిమ్నాస్టిక్స్‌లో భారత్ స్వర్ణం సాధించాలి : ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

రాబోయే ఒలంపిక్స్ లో భారత్ జిమ్నాస్టిక్స్‌లో స్వర్ణం సాధించే దిశగా అడుగులు వేయాలని అందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులే ముందు ఉండాలని గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గురువారం స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలను ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు ఉన్నారని, వీరు మరింత కష్టపడి రాణించి రాబోయే ఒలంపిక్స్‌లో మెరుగైన ఫలితాలు వచ్చేలా కషి చేయాలని ఆకాంక్షించారు. మట్టిలో మాణిక్యాలను మెరుగు పెట్టవలసిన బాధ్యత కోచ్‌లపై ఉందని అన్నారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించి తిలకించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఒ నరసింహారెడ్డి, తెనాలి డబల్ హార్స్ చైర్మన్ శ్యాం ప్రసాద్, డాక్టర్ మేఘన, డాక్టర్ రవి, కార్పొరేటర్లు అశోక్, మీరావాలి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్